

కథా కౌముది

ఓంకారం

మంజుల సరిపల్లె

సైకిల్ ట్యూబ్ ని, చల్, చల్ అంటూ అటు ఇటూ బాలన్స్ తప్పిపోనివ్వకుండా, ధ్యానంగా ఓ కర్రపుల్ల తో తిన్నగా ముందుకి తోసుకొంటూ పరిగెడుతున్న మల్లేశ్ కి వెనకనుంచి ఒక్కసారిగా' బంయ్' మని కారు హారన్ వినిపించగానే తుళ్ళిపడి, సైకిల్ ట్యూబ్ తో సహా రోడ్డుపక్కకి పడిపోయేడు . ఆ కారు తిన్నగా వెళ్ళి తమ ఇంటి ముందే ఆగడం చూసి, అరచేతులకి అంటుకొన్న మట్టిని దులిపి, చేతి చివరన వస్తున్న రక్తాన్ని చొక్కాతో తుడుచుకొంటూ, రోడ్డు కి పక్కగా ఉన్న చిన్నదారి వెంట వెళ్ళి, ఇంట్లో అడుగుపెట్టేడు., తలుపు చాటునుంచి వాడి అమ్మా, నాన్న ఆవచ్చిన వారికి నమస్కారం చేసి, వారిని కుర్చీల్లో లో కూర్చోమనడం, వారికి గాజు గ్లాసులో మంచి నీళ్లందివ్వడం, తరవాత, వారికి సగం తయారీలలో ఉన్న వీణలు చూపడం అంతా చూస్తూనే ఉన్నాడు.

అంతలోనే, వెంకమ్మ వాడిని చూసి, " ఒరే,సిన్నోడా! ఇట్రా,అయ్యగారి కాలికి మొక్కు!"

" అయ్యగోరూ, ఈడు మా సిన్నోడు, మల్లేసు, అని వాణ్ణి కొంచెం ముందుకి తోసి, " సాగిలపడి మొక్కరా ! బాబు గారు దేముడిలాటోరు" అనగానే, పూర్తిగా సాగిలపడి నమస్కారం చేసేడు.

" పోయి, అన్నయ్యని బేగీ పిలచుకురార" అనగానే తల ఊపి, వెంఠనే తూనీగ లాగ పరుగెట్టేడు.

ముందుగా కోనేటి గట్టు, గోశాల, అవతల వైపు రాముల వారి గుడి దగ్గరా అంతా వెతికి, దూరంగా మామిడి తోపు దగ్గర బాగా పెరిగి, ఎండిపోయిన గడ్డి తుప్పల మధ్య ఎత్తుగానున్న గుట్ట మీద కూర్చున్న ఓమ్ ని చూడగానే, 'అమ్మయ్య! ఇక్కడున్నావా? అన్నయ్యా ! ఒ, అన్నయ్యా!బేగీ రా' వాడి అరుపులాంటి పిలుపుని ఓమ్ కి

అందనీవ్వకుండా రివ్వుమంటూ ఈదర గాలి పక్కకి మళ్లించేసింది. అది చూసిన రెల్లుపొదలు అటూ ఇటూ ఊగుతూ ఎగతాళి చేశాయి.

"అన్నయ్యా ! ఒరేయ్, అన్నయ్యా! మనింటికి ఓ పేద్ధ కారు లో ఎవురో వొచ్చినారు. దేవుడిలాటోరు వొచ్చినారని అమ్మ సెప్పింది . బేగీ రారా !"

మల్లేసు ఆయాసం, ఉత్సాహం, సంతోషం అన్నీ కలగాపులగం చేసి చెప్తున్నా, ఆ మాటలేవీ "ఓమ్ " చెవిన పడలేదు. వాడా సమయంలో చేతిలో ఏకతార మీటుతూ , దూరంనుంచి సుమధురంగా వినిపిస్తున్న కోయిల కూతతో పోటీ లో నిమగ్నమై ఉన్నాడు. మల్లేశ్ అదేమీ గమనించకుండా, వాడిని కుదుపుతూ " పట్నం నుంచి ఎవురో పెద్దోళ్లు పెద్ద కార్లో మనింటికి 'ఈన' కోసం వచ్చినారు . అమ్మ నిన్ను పిలుస్తా ఉంది." అని ఒక్క గుక్కలో చెప్పి ఆయాసం తీర్చుకొన్నాడు.

'ఈన' అన్న మాట వినగానే, చురుక్కుమని వాడివైపు చూసి, " ఈన కా దెహే, వీణ" అంటూ చేత్తో ఏక తార, మరో చేత్తో కమాను అలాగే పట్టుకొని, ఒక్క దెబ్బతో గుట్ట మీదనుంచి పెద్ద బండరాయి మీదకీ, దానిమీదనుంచి కిందకీ దూకి, వింటిలోంచి సంధించి వదలిన బాణం లాగ రివ్వుమని తమ ఇంటివైపు పరుగుతీసేడు. వాడి వెనుకనే మల్లేశ్ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ బయల్దేరేడు.

ఓమ్ ఏ స్పీడ్ లో బయలుదేరేడో, అదే స్పీడ్ తో ఇంటిలోపలికి అడుగు పెట్టి, నిటారుగా నిల్చొని, అందర్నీ ఒక్కసారి కలయ జూసేడు. వెంటనే వెంకమ్మ అనందంతో,

"బాబు గారూ ! ఇడుగో, వీడే నండి, మా పెద్ద వాడు, ఓంకార్ ! ఈ పున్నానికి పన్నెండు పూర్తయేయండి."

వెంటనే చేతిలోనున్న ఏకతారని, కమానుని, అమ్మ చేతిలో పెట్టి, కంట్లో పడుతున్న జులపాల జుట్టుని వెనక్కి ఎగరేసి, ఓమ్ కిందకి వంగి, అతనికి సాష్టాంగ నమస్కారం చేసేడు. అమ్మ చేతిలోంచి తిరిగి ఏకతార ని, కమాను ని రెండు చేతులలోనూ యధావిధిగా పట్టుకొని, రెండు చేతుల్ని జోడించి, తల వంచి వినమ్రంగా నిలుచున్నాడు .

" బాబుగారు ఎవరనుకొన్నావ్? గోప్ప వీణ విద్వాంసులు, మహాదేవ శాస్తుర్లు గోరు. మనం ఓ పాలి బాబు గోరి వీణ రేడీయో లో విన్నాం కదరా? అంతటి గోప్ప మడిసి మనింటికీ వచ్చినారంటే, మనం ఎంత పున్నెం సేసుకొన్నామో!" అంది. అది విని, చక్రాలలాటి కళ్ళని పెద్దవి చేసి, ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ చూసేడు.

"బాబుగారూ, మీకు చూపించిన రెండు చిన్న వీణలకి మెట్లు ఈడే స్వయంగా అమర్సినాడు. ఆళ్ళ నాన్నకి వీణ తయారీలో పూర్తిగా సాయంగా ఉంటడండి. మెట్టులో యే సిన్నతేడా ఇనిపించినా, ఇట్టే పట్టేస్తాడు .సంగీతం అంటే వీడికి ఒల్లే తెలీదు, సమయం దొరికితే సాలు బాబూ, ఇదుగో, ఈ ఏక తారని పట్టుకొని, ఏ గట్లంటో, గుడి మెట్ల మీదనో, తోపు లోనో కూర్చోని, అలా ఏదో వాయిస్తానే ఉంటడండి. ఆ సదువుల తల్లి సరస్వతీ దేవి సల్లంగా సూడాలని వీడిని ఆశీర్వదించండి బాబు. అదే మాకు పది వేలు." తన వంతు కూడా వెంకమ్మే ఏకబిగిని మాటలాడుతూంటే, రంగయ్య తనవంతుగా చేతులు కట్టుకొని మర్యాదగా తల వంచి ఒక పక్కన నిలుచున్నాడు.

వెంకమ్మ మాటలకి మహాదేవ శాస్త్రి గారు చిరునవ్వుతో, "అంతా ఆ అమ్మ దయ!" అని ఆప్యాయంగా ఓమ్ తలమీద చేయి వేసి దీవించి " ఏదీ, నాకు ఒక్కసారి ఏకతార వినిపించుతావా ?'' అన్నారు,

"ఓ ! ఈ పొద్దే పోటీ పడి సాధించేను." అని కొంచెం గర్వం తోనూ, కొంత సంతోషంతోనూ కమాను సరి చేసి, తీగె మీద ఎడమ చేతి చూపుడు వేలుని సున్నితంగా కిందకీ, మీదకీ కదలించుతూ, కుడి చేత్తో కమానుని తేలికగా ఆ కొస నుంచి ఈ కోసకి నెమ్మదిగాజారుస్తూ పలికించగానే, ఎదురుగా కోయిల వచ్చి 'కూ, కూ'అని కూసినట్లే అనిపించింది అందరికీ .

అంతవరకు కనులు మూసుకొని కూర్చొని ఉన్న మహాదేవ శాస్త్రి గారు ఉలిక్కిపడినట్లు ఒక్కసారి కనులు తెరచి ఆశ్చర్యం, ఆనందంతో, నోట మాట రాక అలా కొన్ని క్షణాలు ఉండిపోయి, వెంటనే తేరుకొని, " భేష్! చాలా బాగా వాయించేవు. నిజంగా కోయిల వచ్చి ఇక్కడే కూస్తున్నట్లు అనిపించింది. నీ చేతిలో మంచి విద్య ఉంది. అంతా ఆ సరస్వతీ దేవి కటాక్షం !" అన్నారు.

"మరి, మా రాములోరి గుళ్ళో పంతులుగారు పాడుతారు, ఆపాట వాయించనా?" వెంకమ్మ ఏదో చెప్పేలోగా నే, " ఆయత నవాం భవతి" అని పాడుతూ, ఒక నిమిషం వాయించేడు.

"ఓహో! మంత్ర పుష్పమే ? బాగుంది, బాగుంది. పంతులు గారి దగ్గర పూర్తిగా నేర్చుకో !" భక్తి తో తల ఊపాడు.

"రంగయ్యా! నీ కొడుకు మంచి వృద్ధి లోకి వస్తాడు, వాడికి అమ్మ అపారమైన కటాక్షం ఉంది. 'మరి, పెద్ద వీణకి కంచు మెట్లు వేసి, రెడీ చేసి ఉంచితే, నేను వచ్చి తీసుకువెళతాను. వచ్చే నెలాఖరుకి విశాఖ, టౌన్ హల్లో నా కచేరికీ మరి నువ్వు వీణని రెడీ చేసి ఇవ్వాలి సుమా!."

చప్పట్లు కొడుతూ "బలే బలే, అయ్యా, రేపే మనం బొమ్మల సాంబయ్య కొట్టుకి వెళ్ళి, కంచుముక్క కొని, మెట్లు కట్ చేయించేద్దాం, పదిరోజుల్లో వీణ పని పూర్తి చేసి, బాబు గారికి అప్పజెప్పాల, బాబు గారు వీణ నాదం వినగానే, నిన్ను, 'శెభాస్' అని మెచ్చుకోవాల" అన్నాడు ఓమ్.

మెచ్చుకోలుగా ఓమ్ వీపు తట్టి " రంగయ్యా, ఏమంటావ్?" అన్నారు శాస్త్రి గారు.

'' చిత్తం బాబు గోరూ .. మరండీ.." అని ఆగిపోయేడు.

" ఏమిటో చెప్పు?"

" కంచు మెట్లకీ, కాస్త కరుసెక్కువ వుతది, తమరు దయ ఉంచి .. కొంత పైకం సద్దితే"

అర్ధం అయినట్లు తలాడించి, పక్కనే ఉన్న గోవిందయ్య చేత డబ్బులున్న కవర్, అలాగే కారు లోంచి అరటి పళ్ళూ, కొబ్బరికాయ, స్వీట్ పాకెట్టూ తెప్పించి వెంకమ్మ చేతిలో పెట్టేరు మహాదేవ శాస్త్రి గారు. ఓ క్షణం ఆ గదినంతా పరికించి చూసి, ' సరే, మరీ వెళ్ళి వస్తాం' గోవిందయ్య తో కలిసి కారెక్కేరు .

ఇంట్లో అడుగుపెట్టి, కవర్ తెరిచి చూసిన వారికి ఆనందంతో నోటంట మాట రాలేదు.

తండ్రీ కొడుకులిద్దరూ మర్నాడు ఉదయాన్నే లేచి తయారై, ఎప్పటిలాగానే, ఎదురుగా కేలండరు లో నున్న వినాయకుడి కీ, సరస్వతి దేవికీ, వీణకీ భక్తితో నమస్కరించుకొని, బొమ్మల సాంబయ్య కొట్టులో ఒకే సైజులో కంచు మెట్లు కోయించి తీసుకువచ్చి, వాటిని ఆకురాయి రాసి ఉంచేరు.

వీణకి నాలుగు తీగెలూ కుసిల(బిరడాల) మీదుగా కట్టి, మేఱువు మీదనుంచి కుండ మీద అమర్చిన పీట మీద ఉన్న ఇత్తడి రేకు మీదుగా లగామ్ ల్లో ముడి వేసేరు. అలాగే పక్కన మూడు తాళం తీగెలూ బిరడాల లోంచి, కొమ్ము పూసల మీదుగా కుండ మీదన, వంపుగా ఉన్నచిన్న ఇత్తడి రేకు మీదుగా లగామ్ లకి కట్టడం కూడా పూర్తి చేసేకా కానీ తండ్రీ కొడుకులిద్దరూ అన్నం తినలేదు.

మర్నాడు, కుండకి బొద్దులు (గీతల డిజైను)గీసి, టాప్ మీద, ప్లాస్టిక్ డిజైను చెక్కి, అంటించి, పేపర్ కొట్టి, పాలిష్ పని చేసే సరికి సాయంత్రమయింది.

మర్నాడు ఎండ వచ్చే టైముకి మైనం, కరిగించి అందులో మిగతా సామగ్రి కలిపి మైనం గోడలు కడుతున్నప్పటి నుంచి, " అయ్యా, మెట్ల పని నేను సేస్తాను" అంటూ ఓమ్ పక్కనే ఒకటే నస.

వినకుండా, రంగయ్య మొదటగా మేరువు తరవాత మొట్ట మొదట సెంటర్లో తార షడ్జమం, చివరి షడ్జమం, మధ్యమం, చివరిగా రెండు పంచమం మెట్లు వరాసగా అమర్చడానికి సిద్ధం చేసి, పెట్టేముందరే రంగయ్య పనికి అడ్డు పడుతూ, ఆ పొజిషన్ సరిగా లేదనీ, కాస్త అటూ, కాస్త ఇటూ జరపమనీ అంటూ, ఓమ్ చివరికి మెట్లన్నీ తానే పెడతానని పట్టుపట్టాడు .

కొడుకు అడ్డు తగలడంతో , కోపమూ, విసుగూ కొడుకు మీద చూపించలేక, భార్యతో

"వెంకీ, నువ్వయినా చెప్పవే, ఈ పెద్ద వీణ పనికి అడ్డు తగలవద్దని, ఏదైనా తేడా వస్తే, బాబుగోరికి నామొకం చూపించలేను." అన్నాడు రంగయ్య.

అటు కొడుక్కీ, ఇటు మొగుడికీ నచ్చ జెప్పలేక, వెంకమ్మ, ' ఆ తల్లే కాపాడాల' ఆంటూ, వీణ ముందు కూలబడింది.

రంగయ్య చివరకి ఒక నిశ్చయానికి వచ్చి, "ఒరే అబ్బి గా! సరే, నీ మాట ప్రకారమే చేద్దాం . కానీ, నాకేమాత్రం తేడా కనిపించినా, మరి నీ మాట వినను, నువ్విటుకేసి రాకు. సరేనా?" అన్నాడు.

కొడుకు "ఓ! అలాగే అయ్యా!" అని వీణ కి మెట్లు అమర్చడం లో లీనమైపోయాడు. రంగయ్య కాస్త నడుము వాల్చగానే నిద్ర ముంచుకు వచ్చింది.

సాయంత్రానికల్లా "అయ్యా ! చూసుకో! మెట్లన్నీ చరుపులు కూడా సరి చేసేసినాను. మొత్తం మెట్లు స్వరాలన్నీ సరిగ్గా కుదిరినాయి.ఇదుగో, ఎండ తగ్గితే, కుంపటిలో అగ్గి రాజేసి, అట్లకాడతో, మైనం గోడలు లెవెల్ సరి చేసేసినాను. మిగిలిన పని రేపు చేసేద్దాం." ధీమాగా వీణని కాస్త అటు జరిపాడు.

అ అలికిడికి ఉలిక్కిపడి లేచి, అంత పనీ ఒక్కడూ అంత తొందరగా పూర్తి చేసినందుకు, ఆశ్చర్య పడుతూ, ఒక్కొక్క మెట్టు మీద వేలు ఉంచి, తీగె మీటగానే వినిపించిన ఆ నాదం రంగయ్యకి నమ్మలేనంత అద్భుతమనిపించింది.

"భలే సేమత్కారం సేసినావురోయ్ ! సెబాస్ ! శానా బాగుంది" ఓమ్ తలమీద చేయి వేసి, మురిపెంగా దగ్గరకి తీసుకొని " వశే వెంకీ, మా తాత య్యే దిగి వచ్చినట్లున్నాడే! అయ్యగారు ఈ వీణని సూసి, మురిసి పోవాల. అంతా ఆ తల్లి దయ." అన్నాడు రంగయ్య.

రంగయ్యకి కొడుకు పుట్టగానే , గుళ్ళోని పూజారి గారు వాడి జాతక చక్రం వేసి, పిల్లడు సంగీత విద్య లో మంచి పేరు సంపాదిస్తాడనీ, పిల్లాడికి 'ఓంకార్ 'అని పేరు ఇచ్చి, ఓంకారమంటే అన్నీ శబ్దాలకూ మూలమని, సాక్షాత్తూ పరమేశ్వరుడే ననీ చెప్పేరు.రంగయ్య కి ఆమాట చటుక్కున మనసులో మెదిలి, రెండు చేతులూ పైకెత్తి, దండం పెట్టి, గట్టిగా, ' ఓమ్, నమఃశివాయ' అంటూ, మూడు సార్లు అనగానే, వెంకమ్మా, పిల్లలూ కూడా సంతోషంగా వంత పాడేరు.

మరునాడు మరోసారి వీణ పాలిష్, మీదనా, కుండ కి చుట్టూకొమ్ముతో డిజైనూ మిగిలిన పనులన్నీ చక చకా చేస్తూంటే వెంకమ్మా, మల్లేశ్ కూడా ఉడతా భక్తి సాయం లాగ వెనుక నుంచి సామాన్లు అందిస్తూ, చుట్టు పక్కల శుభ్రం చేస్తూ పని తొందరగా అవటానికి చేతులు కలిపేరు.

అ ఉత్సాహంలో " అయ్యా, నాకు వీణ చేయడం నేర్పుతావా?' అని మల్లేశ్ అడగడంతో, రంగయ్యకి, వెంకమ్మకీ పట్టలేనంత ఆనందం కలిగింది. అనుకున్నదానికన్నా వారం రోజులు ముందుగానే వీణ ఎంతో అందంగా తయారయింది.

పదిరోజుల తరవాత గోవిందయ్య ఒక్కడూ వచ్చి వీణ సిద్ధంగానే ఉన్నట్లు తెలుసుకొని వెళ్ళేడు. మరో రెండు రోజుల తరవాత మహాదేవ శాస్త్రి గారు, గోవిందయ్యా వచ్చారు. శాస్త్రి గారు వీణ మూడు స్తాయిల లోనూ అన్నీమెట్లనూ బాగా పరిశీలించి, వాయించి చూశాక " భేష్ ! శెభాష్! వీణ అద్భుతంగా ఉంది. నాదం బ్రహ్మాండంగా ఉంది. రంగయ్యా ! చాలా సంతోషంగా ఉంది. నువ్వు వీణని వారం ముందరే రెడీ చేసేవట?" అన్నారు,

''అంతా ఆ తల్లి దయ బాబు గోరు! ఐతే, ఓ మాట సెప్పాల, బాబుగోరు, వీణ మేళం నా కొడుకు ఒక్క రోజులో సేసేసినాడంటే మీరు నమ్ముతారా బాబూ? సూసిన నా కళ్ళే నమ్మలేక పోయినాయండి. పూర్వం మా ముత్తా తని అందరూ 'మేళం సుబ్బయ్య'' అని పిలిసేవారంట. మేళం సేయడంలో ఆయన్ని మించిన వారెవరూ లేరని పెద్ద పేరండి. ఆ రోజుల్లో వీణలకి తీగెలు కట్టదమూ, మేళం సేయడమూ మా తాతయ్యేఅని మా సిన్నప్పుడు సెప్పుకొనేవోరు. అంత గొప్ప పేరు సంపాదించుకోవాలని నా కొడుకుని ఆశీర్వదించు బాబూ!" అన్నాడు రంగయ్య.

మహాదేవ శాస్త్రి గారు మహదానందంతో "నీ కొడుకు నిజంగా సరస్వతీ పుత్రుడే. ఎన్నో జన్మల పుణ్యం నీది. సాక్షాత్తూ ఆ తల్లి అపారమైన కృప మీమీద ఉండగా, నీకు ఇంకేమీ కావాలి ? వయసులో చిన్నవారయి తేనేమి, మీకిద్దరికీ మనసారా నమస్కరిస్తున్నాను." అని రెండు చేతులూ జోడించేరు.

గోవిందయ్య తెచ్చిన సంచీలోని పళ్ళెం తీసి, అందులో పూలూ, కొబ్బరికాయ, స్వీట్లూ పెట్టి, కుమకుంభరిణెని అందించగానే, శాస్త్రి గారు వీణకి బొట్టు పెట్టి, పూలతో పూజ చేసి, హారతి ఇచ్చి, మరొక సంచీలోంచి చీర, చాపు, పిల్లలకి బట్టలతో , యధావిధిగా దక్షిణ తాంబూలాలు అందించారు.

"ఓంకార్, ఇంతకీ, వీణ నాదం ఇంత అద్భుతంగా ఎలా వచ్చిందో, ఆ రహస్యం నాకు చెపుతావా ?" అని శాస్త్రిగారు కుతూహలంతో ఆడగ్గానే,

" వీణ బాగా పలకాలంటే, మెట్లు పేర్చడంలోనే కాదు బాబుగోరూ, పనస మానుని కుండ కోసం కట్ సేసినాకా, కుండని పలాచగా దొలవాల, కుండ టాప్ మీద కొద్దిగా ఉబకం తీసుకురావాలా, అలాగే మెట్ల కింద బ్రిడ్జ్ కూడా కొద్దిగా దోని వంపు తేవాలా, మేరువు వంపు కరెక్ట్ గా ఉండాలా, తీగెలు పెట్టే చిన్న పలకా ఇంకా .."

వాడి మాటలకి మధ్యలో "అబ్బో, పిట్ట కొంచెం, కూత ఘనం' అన్నట్లు, చాలా విషయాలే చెపు తున్నావు. నీ ప్రతిభ కి జోహార్లు! సరే మరీ, బయల్దేరుతాం." వీణకి శాలువా కప్పి, " నా వీణ కచేరీ కి తప్పకుండా రావాలి. ముందుగా కబురు పెడతాను." అన్నారు శాస్త్రిగారు.

గోవిందయ్య వీణని పట్టుకొని, శాస్త్రి గారి వెనకనే కారెక్కేడు.

కనుమరుగయేవరకూ కారువైపే చూస్తూ ఇంట్లో కి వెళ్ళాకా కానుకలూ, దక్షిణతో బరువైన కవరూ చూసుకొన్న వాళ్ళ కళ్ళలో ఆనందం వెల్లివిరిసింది.

మరీ కొన్నాళ్ళకి, వీణ కచేరీ సంగతి గోవిందయ్య ద్వారా తెలుసుకొన్న రంగయ్యా, ఓమ్ బస్సులో విశాఖపట్టణం టౌన్ హాలుకి చేరుకొన్నారు. అక్కడి జన సమూహం, పోలీసుల అదలింపులూ చూసి, వాళ్ళ అడుగులు ముందుకు పడలేదు.

మరికొంత సేపటికి పోలీసులు "మంత్రి గారు వస్తున్నారు, దారి ఇవ్వండి .. తప్పుకోండి" అంటూ, అందరినీ లైనులో పెడుతున్నారు. మంత్రి గారి వెంటే జనమంతా హాల్లోకి వెళ్ళగానే హాలు తలుపులు మూసేశారు.

హడావిడి అంతా ముగిశాక, రంగయ్య ధైర్యం చేసి పోలీసు దగ్గరకి వెళ్ళి "బాబూ, మేము అయ్యగారి వీణ వినడానికని, బొబ్బిలి నించి వచ్చినం. అయ్యా! మేము వీణలు తయారు సేసి, అమ్ముకొని బతికేవారం. బాబూ, సత్తె పమాణికంగా సేపుతా ఉన్నాను, బాబు గారికి వీణ మేమే తయారు సేసినాం బాబూ. మమ్మల్ని లోనికి పంపరా బాబూ?" బతిమాలుకున్నారు, పోలీసు దయ వల్ల ఎలాగైతేనేమి వారిద్దరూ హాల్లో అడుగుపెట్టి, చివరి వరసలో నిల్చొని, ఒళ్ళంతా కళ్లుచేసుకొని చూస్తున్నారు.

మొదట మంత్రిగారు, మిగతావారి ఉపన్యాసాల తరవాత మహాదేవ శాస్త్రి గారికి చాలామంది పూలదండలతో, శాలువలతో సత్కారాలు చేశాక వీణ కచేరీ మొదలయింది.

ఓమ్ ధ్యానంతో కళ్ళు మూసుకొని తన్మయత్వంతో పరవశించి పోతున్నాడు. వాడి మనసు ఎక్కడికో ఊహా లోకాల్లో విహరిస్తోంది.

మహాదేవ శాస్త్రి గారి చేతిలో వీణ పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తోంది. హాల్లో జనాన్నే కాకుండా, హాలు బయట ఉన్న వారిని కూడా మంత్ర ముగ్ధులను చేసి, పూర్తి వాతావరణాన్నే సంగీత మయంగా మార్చివేసింది, మహాదేవ శాస్త్రీగారి వీణ మాధుర్యం మూడుగంటలసేపు శ్రోతలనందరినీ ఉర్రూతలూగించింది. మంగళ హారతితో కచేరీ ముగిసింది.

శ్రోతల చప్పట్లతో హాలు మారుమోగుతూండగా, కార్యక్రమ అధినేత, సంగీత విద్వాంసుడూ, సద్విమర్శకుడూ అయిన అవధాని గారు స్టేజి మీదకి వచ్చి, శాస్త్రి గారికీ, సభకీ నమస్కరించి

" ఏ జన్మలో చేసుకొన్న పుణ్య ఫలమో, ఈనాడు మనమంతా శాస్త్రిగారి వీణ నాదామృతంలో మై మరచి మన తనువూ, మనసూ ఆ ప్రణవ నాదానికి, ఆ ఓమ్ కారానికి అర్పించి, ధన్యులమయాము. మీకందరికీ తెలిసిన విషయమే అయినా, మరొకసారి నామాటగా చెప్తున్నాను. "వీణ " అన్నమాట వినగానే మనందరికీ వెంటనే సంగీత, సాహిత్య సమలంకృత అయిన సరస్వతీమాత స్వహస్తాలతో వీణ మీటుతూ దర్శనమిస్తుంది. అంటే, వీణ మానవసృష్టి కాదు.వేదకాలంలోనే ఆవిర్భవించిన దైవసంబంధిత సృష్టి "వీణ" నారదుని 'మహతి', సరస్వతీదేవి చేతిలోని 'కచ్ఛపి' మనకి తార్కాణాలుగా కనుపిస్తూనే ఉన్నాయి. అందుచేత వీణ ప్రాచీనత, ప్రశస్తి వేరే చెప్పనక్కరలేదు. పాటతోపాటూ తాళం కూడా వాయించగలిగే వాయిద్యం వీణ ఒక్కటే. అంతేకాక,తానం అనే ప్రక్రియ వీణ కోసమే లేక తానం కోసమే వీణ ?అనే సందేహం కలుగుతోంది. అంతటి మహత్తరమయిన వీణని మనం ఈనాడు వినగలిగామంటే, సాక్షాత్తూ అ సరస్వతీదేవి అనుగ్రహం మనకందరికీ లభించినట్లే. శాస్త్రిగారి వీణ నాదంలోఝంకారం మన శరీరంలోని అణువణువునా

స్పృశించి, మనజన్మకి ధన్యతని చేకూర్చిందని, మనందరితరపునా చెపుతూ, కృతజ్ఞతాభివందనలను సమర్పించుకొంటున్నాను.'' అన్నారు. వెంటనే సభలో చప్పట్లు మారుమ్రోగేయి.

''శ్రీ. మహాదేవ శాస్త్రి గారి ప్రతి వీణ కచేరీకి నేను హాజరయి, ఆయన వీణ వాదనను చాలా సన్నిహితంగా, ఉత్సుకతతో పరశీలించి, ఆస్వాదించ గలిగినందుకు నేనెంతో అదృష్టవంతుణ్ణి. ఐతే, ఇన్నాళ్ళూ నేను విన్న వీణ మాధుర్యం ఒక ఎత్తూ, ఈనాటి వీణ మాధుర్యం మరొక ఎత్తూ అని చెప్పక తప్పదు. ఇంత విద్వత్తును సాధించగలిగిన ఆయన సాధన అపూర్వం, అద్వితీయం, అద్భుతం! శాస్త్రి గారి పై దేవి కృప ఆమోఘం, అపారం!'' కొనసాగిన ఆయన ప్రసంగానికి సభ లో చప్పట్లు పది నిమిషాలుపాటు ఆగకుండా మారు మ్రోగేయి.

శ్రీ మహాదేవశాస్త్రి గారు రాగాలాపన లోనూ, తానం వాయించడంలోనూ ప్రత్యేకమైన తన శైలి లో స్వరాల అల్లికలతో పాటూ, చేతి వేళ్ళ కదలికలతో అనూహ్యమైన విన్యాసాలను సృష్టించారు. ఎడమ చేతి చూపుడు, మధ్య వేళ్ళతో పాటూ ఉంగరం వేలితో కూడా కలిపి ఒకే సమయం లో మూడు తీగెల లో మూడు మెట్లను నొక్కి మూడు స్థాయిలలో స్వరాలను పలికించి, అలాగే కుడి చేతి చూపుడు, మధ్య, వేళ్ళతో తీగెలను మీటుతూనే, తాళం తీగెలను చిటికెన వేలితోనే కాకుండా, బొటన వేలితోనూ, ఉంగరం వేలితోనూ కూడా ఒకటొకటి గా మధ్య మధ్యలో మీ టు తూ , ఒక స్వరంలో సప్త స్వరాల అనుభూతిని కల్పించి, , ' న భూతో న భవిష్యతి ' ప్రతిభను ప్రదర్శించి, శ్రోతలను మైమరపింపజేసేరు. మరోమాట! శాస్త్రి గారు మూడు స్థాయిలలో ఒకేసారి మంత్ర పుష్పం వాయించి, మన ఎదురుగా గురు శిష్య బృందం మంత్ర పుష్పాన్ని చదువుతున్న చక్కని అనుభూతిని కలిగించారు. శాస్త్రి గారి వీణ వింటున్నంతసేపూ నామనసులో కలిగిన మధురమైన దృశ్యాలనీ, ఊహాలనీ, ఉప్పొంగిన ఆనందాన్నీ మీ అందరి అనుమతి తో యధాతధంగా మీ అందరిముందూ చెప్పాలనిపించింది, చెప్తున్నాను.. వీణ వింటూన్ననతసేపూ నాలో కలిగిన భావాలూ, అనుభవాలూ అనూహ్యమైనవీ, అలౌకికమైనవీను.నా ఈ స్పందనని విన్న మీరు నాతో ఏకీభవించినట్లైతే, లేచి నిల్చొని మీ సమ్మతిని తెలియజేయండి. అను మందర, మంద్ర స్థాయి వాయిద్యం లో కొండల మీదనుంచి జలజలా రాలే జలపాతాలూ, కొండలకి నలువైపుల నుంచీ బరువుగా, గుంపులు గుంపులుగా, వస్తున్న కారు మేఘాలూ, మేఘాల ఒరవడిలో గంభీరంగా మందర స్థాయి గర్జనలూ! ఏటిమీదనుంచి జర్రుమంటూ జారుతున్న సన్నటి గాలి తిమ్మెరలూ, సన్నగాలికి ఒళ్ళు ఝుల్లుమనే మైనా గోరువంకల రెక్కల టపటపలూ, మధ్య స్థాయి మంతనాలూ, మందర, మధ్య స్థాయిల లో మామిడి మానులపై గండు చీమల గోష్టి గానం, ఆకుపచ్చని గరిక తివాచీపై తూరీగా, తుమ్మెదల సంవాదనలూ, గుడి గంటల ఓంకారాలూ, పూల తోటల్లో రంగు రంగుల పరిమళాలు సెలయేటి గాలి తరంగాలపై తేలి, కలగలుపు విందూ, సుదూరాలలో తారస్థాయి లో మధురంగా కోకిల కుహకుహలూ, చిట్టి చిట్టి గంతులు వేస్తున్న పిట్టలూ, అన్నీ ఒకటొకటిగా శూన్యంలో అంతర్లీనమై ఉన్న ఓంకారంతో శృతి కలిపే యత్నం..

మందర, మధ్య, తార స్థాయిలతో గొంతు కలిపే వినూత్నమైన ప్రణవనాదం ! శాస్త్రిగారి వీణ వాదన, వీణ నాదం ఒకదానితో ఒకటి పోటీ పడిన అద్భుతమైన సమాగమం ! ముఖ్యంగా ఆయన వివిధ రకాల తానాలనూ వివరిస్తూ – గజ తానం లో ఏనుగుల మంద గమనాన్ని, మాండూక్య తానంతో కప్ప గంతులనూ, అశ్వ తానంలో గుర్రం హొయలూ నడకలూ, మర్కట తానం లో కోతి కుప్పి గంతులనూ, చక్ర తానం లో చక్రభ్రమణాన్నీ, ఇలా ఒకటేమిటి, అనేకమైనటువంటి తాన విన్యాసాలను వాటికి అనుగుణమైన రాగాలలో ప్రదర్శించి అసమానమైన పాటవాన్ని ప్రదర్శించారు. శాస్త్రి గారు ప్రతి పాటా వాయించే ముందర దానియొక్క ప్రత్యేకత ను వివరించి చెప్పటం వలన సంగీతం తెలియని వారికి కూడా పాటని గురించి కొంత అవగాహన ఏర్పడి , ఇంకా ఉత్సాహం తోనూ, శ్రద్ధ తోనూ విని ఆనందించే అవకాశం లభించింది. ఇవన్నీ మాటల్లో చెప్పలేని అనుభవాలూ, మాటలకందని భావాలూనూ.అలౌకిక మైన దర్శనాలూను.ఇంకా చాలా చెప్పాలని ఉన్నా, సమయం చాలదు కనుక ఇంతటితో విరమిస్తున్నాను.” అని ఆయన ముగించిన వెంఠనే సభికులంతా లేచి చప్పట్లతో పది నిమిషాల సేపు హాలు దద్దరిల్లజేసేరు.

కొందరు శాస్త్రి గారిని పూలదండలతో, శాలువలతో సన్మానిస్తూండగా, మరి కొందరు బయటకి వెళ్ళే ప్రయత్నంలో హడావిడి మొదలైంది

ఆ తోపులాటలో, పోలీసుల అదలింపులతో రంగయ్య, ఓమ్ స్టేజి ముందుకు వచ్చిపడ్డారు. దూరంనుంచే శాస్త్రి గారికి రెండు చేతులూ ఎత్తి దండం పెట్టి వెనుదిరిగే సమయానికి మైకులో గట్టిగా “ రంగయ్య గారు, ఓంకారూ స్టేజ్ మీదకి తొందరగా రావాలి.” అని పదే పదే పిలుస్తున్నారు.

అంతలో గోవిందయ్య రంగయ్యనీ, ఓమ్ కార్ నీ స్టేజ్ మీదకి తీసుకువెళ్ళేడు. వాళ్ళిద్దరూ అయోమయంగా దిక్కులు చూస్తూండగా మహాదేవ శాస్త్రి గారు మైక్ లో “సభాసదులందరికీ నమస్కారం. దయచేసి అంతా కూర్చోండి.” అన్నారు. మెల్లగా అందరూ కూర్చోనగానే, “మీ అందరి అభిమానానికీ, అవధాని గారి ప్రశంసలకూ చాలా చాలా ధన్యవాదాలు. అవధానిగారు చెప్పినట్లు, ఈ నాటి నా వీణనాదం మరొక ఎత్తు అనేచెప్పాలి.అద్భుతం! నిజానికి నేనేమీ వాయించ లేదు, అంతా ఆ సరస్వతి మాత కృప. ఆ అమ్మే నాచేత వాయింపజేసింది. ఇంతసేపూ నాద్వారా రా విన్న అపూర్వమైన నాదాన్ని పలికిన వీణని అహర్నిశలూ కష్టపడి తయారుచేసిన కళాకారులు రంగయ్య గారు, వారి కుమారుడు చిరంజీవి ఓంకార్. అసలైన సరస్వతీ పుత్రులు! సరస్వతి మాత దయ వల్లనే కదా వీరు ఇంతటి ఘన కార్యాన్ని సాధించగలిగేరు. నా వీణ విని ఆనందించేరు సరే, మీలో ఎవరైనా ఈ వీణని ఇంత బాగా ఎవరు తయారు చేసేరని ఆలోచించేరా?

తెర వెనక ఉండిపోయిన ఈ శ్రమ జీవులని, నిరాడంబర కళాకారులనీ గుర్తించి, సత్కరించడం మన అందరి బాధ్యతా, కర్తవ్యం కూడా! వీరు ఘనసన్మానానికి ఎంతైనా అర్హులు! ముఖ్యంగా ఈ పన్నెండేళ్ళ చిన్నారి ఓంకార్ కి చిన్నతనం నుంచీ వీణ తయారీలోనూ, సంగీతంలోనూ ఉన్న అపారమైన శ్రద్ధ, భక్తీ, నైపుణ్యం అమోఘం. తండ్రితో పాటూ కలిసి ఈ వీణని ఇంత మధురంగాచేసినది ఇతనే! వీరు పేరు ప్రతిష్టలను ఆశించకుండా, ఆ సరస్వతీ దేవినే నమ్ముకొని, వీణలు తయారు చేయడం ద్వారా ఆ తల్లికి ఎనలేని సేవ చేస్తున్న ధన్య జీవులు." అన్నారు.

శాస్త్రిగారూ, కార్యకర్తలూ కూడా రంగయ్య నీ, ఓంకార్ నీ సభాసదుల చప్పట్ల మధ్య శాలువలను కప్పి పూలమాలలతో, బహుమతులతో దక్షిణలతో సత్కరించేరు.

కళ్ళనిండా నీళ్ళతో, అందరికీ చేతులెత్తి నమస్కరిస్తూ, ఫోటోగ్రాఫర్ల మెరుపుల మధ్య నుంచి, ఊహించని ఆ సత్కారాన్ని, కలా ? నిజమా? తెలియని అయోమయంలో, అచేతనంగా ఉండిపోయిన వారి దగ్గరకి శాస్త్రి గారు వచ్చి, "రంగయ్యా, నువ్వు ఏదైనా ... మీ గురించి మా ఆందరికీ చెప్పు" అని మైకు అందించారు.

వణుకుతున్న చేతులతో మైకు పట్టుకొని, మాటలు తడబడుతూ " అందరికీ నమస్కారమయ్యా! నాకేటి సేప్పాలో తెలియకుంటన్నది. ఈ రోజు బాబుగోరి వీణ విని, నా జనమ తరించిపోయింది. నా నోటంట మాటలే రావటం లేదు. ఇంకా యేమి సేప్పేది బాబూ?" అన్నాడు రంగయ్య.

సభలో ఒకతను " మీరు ఎన్నాళ్ళబట్టి వీణలు చేస్తున్నారు అదీ మీకు తెలిసినది చెప్పండి" అన్నాడు.

"చిత్తం, ఆలాగేనయ్యా ! మా కుటుంబాలవాళ్ళం, మూడు తరాలనుంచి వీణలు తయారు చేసుకొని బతుకుతున్న వోళ్ళం .. మా నాన్న, తాత, అమ్మ వైపు, నాన్న వైపూ అందరం ఇదే వృత్తి. మా నాయన పేరు,లక్ష్మణ మూర్తి పిఠాపురం లోని సంగమేశ్వర శాస్త్రి గోరి కీ, పట్నాల సూర్యనారాయణ మూర్తి గోరికీ ఇంకా సానామందికి వీణలు తయారు సేసినారని నా సిన్నతనంలో సెప్పుకొనేవారండి. మా నాన్నమ్మకి నాన్న బొబ్బిలి రాజుగారి కోటలో పని సేసేవోరంట, ఆ టయాంలోనే, రాయుడి గోరి దగ్గర మా తాత వీణ తయారీ నేరసుకొని, మా నాయనకీ, మా వాళ్ళందరికీ వీణలు తయారు సెయ్యడం నేర్పేరంట. అ రోజుల్లో యవరి వీణాలైనా సరే మేళం చేయడానికీ, , తీగెలు కట్టటానికీ పత్యేకంగా పిలిసేవో రంట. బొబ్బిలి లో వాసా వారని, ఆ వీణ విద్వాంసుల వల్లనే, బొబ్బిలి వీణ కి మంచి పేరొచ్చిందండి. కానీ, ఏ మాటకామాటే సెప్పుకోవాల! విజియనగరం మహారాజులు సంగీతానికి మా గొప్ప సేవ సేసినారనే సెప్పుకోవాల! అక్కడ సంగీత కాలేజీ పెట్టిన కాడనుంచి, అప్పట్లో వీణల తయారీలో మా మామయ్య నారాయణ మూర్తికి మంచి పేరు ఉండేదంట.. అవన్నీ కతలలాగా చెప్పుకొనే వారం.

రోజులు మారిపోయేయి. మా కుటుంబాలన్నీ బొబ్బిలి వైపే ఉండిపోయేం కనక బొబ్బిలి వీణ అన్న పేరు వచ్చినాది. అయితే, కొందరు పట్నాలకి వెళ్ళిపోయేరు.అయ్యా!మాకీ పని తప్ప మరేపనీ చేత కాదయ్యా, మాకింకేటీ తెలవదు బాబూ! ఆ సరస్వతి దేవినే నమ్ముకొని బతికే వాళ్ళం. ఈనాడు ఇలా మీ ముందు నిల్చున్నామంటే అ తల్లి దయ, శాస్త్రి బాబు గోరి వల్లమాలిన అభిమానమేనండి" అంటూ, ధారాపాతంగా వస్తున్న కన్నీటిని పై కండువా తో తుడుచుకొంటూ, శాస్త్రి గారి కాళ్ళమీద పడి "అయగోరూ! ఇదంతా ఏటండీ? మీ ముందు మేమేపాటి అయగోరూ?" అంటూ సాష్టాంగ నమస్కారం చేసేడు.

పక్కనే ఉన్న ఓమ్ కూడా శాస్త్రి గారి కాళ్ళకి సాష్టాంగ నమస్కారం చేశాడు. చప్పట్లతో హాలు దద్దరిల్లిపోయింది.

కొంతసేపటికి సద్దుమణిగాక, కార్యకర్తల సహకారంతో సభికులు వారికి తోచిన విరాళాలు శాస్త్రి గారి ద్వారా రంగయ్యకి అందించబోతే, రంగయ్య, ఓమ్ కూడా స్వాభిమానంతో, వెనుక అడుగు వేశారు.

వారి మానసిక స్థితిని ఊహించిన శాస్త్రి గారు " రంగయ్యా ! ఈ సన్మానానికి తగినవారు మీరే. మరేమీ మాటలాడకు. ఇది మా అందరికీ మీ మీద ఉన్న గౌరవమూ, అభిమానమూ, మరొకలా చెప్పాలంటే ఆ కళామతల్లి, చదువుల తల్లికి అర్పించే చిరు కానుక, కాదనకు" భుజం పట్టుకొని, కన్నీళ్ళతో లేవదీశారు.

సభికులలో కొందరు వచ్చి రంగయ్యనూ, ఓంకార్నీ పూలదండలతో సత్కరించి, వారి చేతులు పట్టుకొని ప్రశంసిస్తూ, వారితో ఫోటోలు తీసుకొని ఆప్యాయంగా కొంతసేపు మాటలాడూతూంటే వారికి ఆనందంతో కన్నీళ్ళు ఆగలేదు. శాస్త్రిగారు గోవిందయ్య సాయంతో వారిని అందరిమధ్యనుండీ తప్పించుతూ,వారిని సాదరంగా కారుదగ్గరకి తీసుకువెళ్ళేరు.

ఓంకార్ మరోసారి శాస్త్రి గారికి పాదాభివందనం చేసి "బాబుగారూ, మీతో ఒక్క మాట సెప్పాలని ఉంది.." అన్నాడు.

"అలాగా..? చెప్పు మరి."

"మరేమో, మీరు వీణ వాయిస్తున్నంతసేపూ, నా కళ్ళెదుట మా గుడిలో రాములవారూ, గుడి గంటలూ, కోనేరూ, పిట్టల అరుపులూ, మేఘాలూ, పువ్వులూ, తుమ్మెదలూ, గాలి లోంచి కోయిల పాట అన్నీ కనిపించేయండి. నాకు చాలా చాలా సంతోశంగా ఉందయ్యా."

వాడి చిన్న మనసుకి కలిగిన అనుభవం ఎంత సహజంగా వ్యక్తం చేసేడో నని, అబ్బుర పడుతూ, శాస్త్రిగారు వాడిని ప్రేమతో దగ్గరకి తీసుకొన్నారు.

వెనుకనుంచి కెమేరాల ఫ్లాష్ లైట్ల మెరుపుల మధ్య, అందరూ వీడ్కోలు చెపుతూండగా, సాధనమూ, సాధన, సాధ్యం ఒకటిగా ఓంకారమై కారు ముందుకు కదిలింది.

COMMENTS